సారథి లేని విద్య..!

- ఊట్కూర్‌కు మాత్రమే రెగ్యూలర్ ఎంఈఓ
- ఈ నెల 30న ఆయన కూడా రిటైర్డ్
- ఎంఈఓలు లేని జిల్లాగా మారన్నున పేట
- ఇద్దరు మహబూబ్‌నగర్ జీహెచ్‌ఎంలకు ఇన్‌చార్జి ఎంఈఓల బాధ్యతలు
- రేపటినుంచి పాఠశాలలు పున: ప్రారంభం



మరికల్ ఎంఈఓ కార్యాలయం (ఫైల్)

మరికల్: నారాయణపేట జిల్లా ఏర్పడిన నాటి నుంచి రెగ్యూలర్ ఎంఈఓలు లేక విద్య వ్యవస్థ గాడి తప్పింది. ప్రభుత్వ పాఠశాలలు పర్యవేక్షణ లేక ఉపాధ్యాయులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. ఎంఈఓ కార్యాలయాలకు ప్రతి ఏడాది వచ్చే నిధులు ఎక్కడ పోతున్నాయి. ఒక పైసా కూడా ఖర్చుకావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి మండలానికి రెగ్యులార్ ఎంఈఓలు లేకపోవడమే కారణంగా చూపుతుంది. మొత్తం 514పాఠశాలలు ఉండగా ప్రతి మూడు, నాలుగు మండలాలకు ఒక ఇన్‌చార్జి ఎంఈఓలను నియమించడంతో వారు సరైన పర్యవేక్షణ చేయకపోవడంతో పరీక్ష ఫలితాలతోపాటు అభివృద్ధి పనులపై ప్రభావం పడుతుంది. రేపటినుంచి తిరిగి పాఠశాలలు పున:ప్రారంభం కావడంతో ఎంఈఓల బాధ్యతలు హెచ్‌ఎంలు, సీఆర్‌పీలపైనే ఆధారపడి ఉంది.

రెగ్యూలర్ ఎంఈఓ ఈయనే..

ఊట్కూర్ మండల ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న వెంకటయ్య ఒక్కరే రెగ్యులార్‌గా ఉన్నారు. ఈయన కూడా ఈ నెల 30న పదవీ విరమణ పొందనున్నారు. ఉన్న ఒకే ఒక ఎంఈఓ పదవీ విరమణ పొందితే ఎంఈఓలు లేని జిల్లాగా నారాయణపేట చరిత్రలో నిలిచిపోతుంది. ఈయన స్థానంలో ఎర్ని ఇన్‌చార్జిగా నియమించాలో అధికారులు ప్రయత్నాలు చేపట్టారు.

ఎవరికి ఎన్ని మండలాలు..

ఊట్కూర్ మండలం రెగ్యులార్ ఎంఈఓగా ఉన్న వెంకటయ్య ఊట్కూర్‌తోపాటు నర్వ, మక్తల్, మాగనూర్, కృష్ణ మండలాల బాధ్యతల్ని పర్యవేక్షిస్తున్నారు. ఇన్‌చార్జిలుగా ఉన్న మహబూబ్‌నగర్ జీహెచ్‌ఎం గోపాల్‌నాయక్ నారాయణపేట, దామరగిద్ద, మద్దూర్‌లతోపాటు కొత్తపల్లి మండలాల్ని చూస్తున్నారు. మహబూబ్‌నగర్ బాలికల ఉన్నత పాఠశాలకు బదిలైన మరో జీహెచ్‌ఎం అంజలిదేవి కోస్గి, గుండుమాల్, ధన్వాడ, మరికల్, బాధ్యతల్ని నిర్వహిస్తున్నారు.

నిధులు ఏమయ్యాయి..

ప్రతి ఏడాది మండల ఎంఈఓ కార్యాలయానికి ప్రభుత్వం నుంచి రూ. 74వేల నిధులు మంజూరవుతాయి. వీటితో ఎంఈఓ కార్యాలయంలో కరెంట్ బిల్లులు, కంప్యూటర్ల రిపేర్లోపాటు ఇతర కార్యాలయ ఖర్చుల నిమిత్తం ఏడాదిపాటు వాడుకోవాలి. కానీ ఈ నిధులను ఎక్కడ కూడా ఇన్‌చార్జి ఎంపీఓలు ఖర్చుచేసినట్లు లెక్కలు కన్పించడం లేదు. మరో రెండు రోజుల్లో పాఠశాలలు పున:ప్రారంభమవుతున్నాయి. విద్యార్థులకు దుస్తులు ఉచిత పుస్తకాలు, సిద్ధం చేసి అందించాలని ప్రభుత్వ లక్ష్యం. వీటి పంపిణీ అంతా సిద్ధంగా ఉండాల్సిన బాధ్యత ఎంఈఓల పైనే ఉంది.

ప్రస్తుతం ఇన్‌చార్జిపాలన కొనసాగిస్తున్నాం..

రెగ్యూలర్ ఎంఈఓల నియామకం జరగకపోవడంతో ప్రస్తుతానికి ఇన్‌చార్జి ఎంఈఓలనే జిల్లా అంతట ఒక్కొక్కరికీ మూడు నుంచి నాలుగు మండలాల చొప్పున కేటాయించాం. ఈ నెల చివరికి ఊట్కూర్ ఎంఈఓ పదవీ విరమణ పొందుతున్నారు. ఆ స్థానం కూడా ఖాళీ కానుంది. ఈ విషయాన్ని తమ ఉన్నత అధికారులతో చర్చించి ఎవర్ని నియమించాలో తెలుస్తాం. ఎంఈఓ కార్యాలయాలకు వచ్చే నిధుల దుర్వినియోగం విషయాన్ని అక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జి ఎంఈఓలతో చర్చించి దుర్వినియోగం జరిగితే చర్యలు తీసుకుంటాం.

– అబ్దుల్ ఘని, జిల్లా విద్యాధికారి, నారాయణపేట

క్లుప్తంగా

ఎమ్మార్సీకి చేరిన పాఠ్యపుస్తకాలు



మాగనూర్: మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయానికి పాఠ్యపుస్తకాలు చేరినట్లు మండల ఇన్‌చార్జి ఎంఈఓ వెంకటయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకాలంలోనే పాఠ్యపుస్తకాలు పాఠశాలలకు అందించడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పాఠశాలలు పున:ప్రారంభమైన వెంటనే ఆయా పాఠశాలకు వీటిని సరఫరాచేసి సకాలంలో విద్యార్థులకు అందించి వారికి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. మొదటి విడత పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. మిగిలినవి త్వరలోనే వస్తాయన్నారు.

మురుగు కాల్వసమస్య పరిష్కరించాలి



ధన్వాడ: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో అండర్‌డ్రైయినేజీ వ్యవస్థసరిగ్గా లేకపోవడంతో వర్షాకాలంలో మురుగునీరు చేరి ఇంట్లోకి రావడంతో కాలనీవాసులు పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఎంపీడీఓ సాయిప్రకాష్ కాలనీని సోమవారం సందర్శించారు. ప్రస్తుతం పంచాయతీలో నిధులు లేనందున నిధులు వచ్చిన వెంటనే మరమ్మతు పనులను చేపడుతామని కాలనీవాసులకు తెలిపారు. కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

కూలిన ప్రహరీ



మాగనూర్: మండలంలోని నల్లగట్టున మారెమ్మవ్వ ఆలయం వద్ద కస్తుర్బా గాంధీ బాలిక పాఠశాల ప్రధాన ప్రహరీ కూలిపోయి చాలా రోజులవుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో కూలిన ప్రహరీతో విద్యార్థుల రక్షణ ప్రశ్నర్థాకంగా మారుతుందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రహరీ మరమ్మతులు చేపట్టి గేటు బిగించాలని కోరుతున్నారు.

పట్టుదల ఉంటే ఏదైనసాధ్యం



మక్తల్: పట్టుదల ఉంటేనే ఏదైన సాధించగలమని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం మండలంలోని సమ్మర్ క్యాంప్‌లో శ్రీనివాస్ సెంటర్‌లో విద్యార్థులు కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.. విద్యార్థులు సమయం వృథా చేసుకోకుండా కంప్యూటర్ నేర్చుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని వర్కూర్‌కు చెందిన శ్రీనివాసులు కంప్యూటర్ సెంటర్ ఏర్పాటుచేయడంపై అభినందించారు.

క్రీడాకారులకు అభినందన..

మండలానికి చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌పోటీలో ఈ నెల 6, 7వ తేదీలో వరంగల్‌లో జిల్లా హన్మకొండలో జరిగిన అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలో పతకాలు సాధించడంపై విద్యార్థులను అభినందించారు. కార్యక్రమలలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి,కట్టవెంకటేష్, వెంకటేష్, శంశోద్దీన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ..

ఊట్కూరు: అనారోగ్యంతో మృతిచెందిన మిషన్‌భగీరథ కార్మికుడు శేఖర్ కుటుంబాన్ని ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం మండలంలోని బాధితకుటుంబానికి పరామర్శించారు. బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందేవిధంగా కృషి చేస్తానని తెలిపారు. మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీ దొబ్బలి హన్మంతు విజ్ఞేశ్వర్‌రెడ్డి, లింగం, భరత్, రమేష్ తదితరులు ఉన్నారు.

కస్తుర్బా భవనం ప్రారంభించాలి


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మరికల్: మండలంలోని పస్పుల శివారులో నూతనంగా నిర్మించిన కస్తుర్బా పాఠశాలను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు రాజేష్, వెంకటేష్, నరేష్‌గౌడ్ అన్నారు. పస్పుల వద్ద నిర్మించిన నూతన భవనాన్ని సోమవారం వారు పరిశీలించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ మండలానికి సంబంధించి కస్తుర్బా ధన్వాడ కస్తుర్బా భవనంలోని ఇరుకు గదుల్లో కొనసాగించడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తుచేశారు. గత ఐదేళ్ల నుంచి అక్కడ విద్యార్థుల ఇబ్బందులను అధికారులు దృష్టిలో ఉంచుకొని ఈ విద్య సంవత్సరం నుంచి పస్పుల వద్ద నిర్మించిన భవనం ప్రారంభించి కస్తుర్బాను ఇక్కడికి తరలించాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎమ్మెల్యే తక్షణమే నిర్ణయం తీసుకోవాలని కోరారు. వెంటనే సమస్యను పరిష్కరించి ప్రహరీ నిర్మాణ పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

క్షత్రియ సమాజ్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు


విద్యార్థులను అభినందిస్తున్న సమాజం పెద్దలు

నారాయణపేట రూరల్ : జిల్లా వ్యాప్తంగా నివసిస్తున్న క్షత్రియ సమాజ్‌కు చెందిన కుటుంబాల్లోని విద్యార్థులు గత విద్యా సంవత్సరంలో వివిధ కోర్సుల్లో చక్కటి ఫలితాలు సాధించిన వారికి సోమవారం ప్రోత్సహకాలు అందించారు. ఎస్ఎస్‌కే సమాజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అంబాభవాని మందిరంలో సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో టెన్త్‌లో చక్కటి జీపీఏ, ఇంటర్‌లో మంచి మార్కులతోపాటు ఐఐటీ, నీట్‌లో ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులకు శాలువాతో సన్మానించి ప్రశాంసాపత్రం, జ్ఞాపికలు అందించారు. వక్తలు మాట్లాడుతూ.. శ్రద్ధతో చదివి ఉన్నతశిఖరాలు అధిరోహించాలన్నా రు. నాగురావు నామాజీ, నారాయణరావు, లక్ష్మణ్, శ్రావణ్, రాజ్ కుమార్, నందునామాజీ, రేణుక, ప్రమీలాబాయి, హన్మంత్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న మేనేజర్

ఊట్కూరు: ఎస్‌బీఐ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ బండారు మోసెస్ అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌బీఐ బ్యాంకులో ఆర్థిక అక్షరాస్యత పై ఖాతాదారులకు అవగాహన కలిపించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు బ్యాంకు ఖాతాదారులకు నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పిస్తున్నామని ఆయన అన్నారు. ఏటీఎం, క్రెడిట్‌కార్డు, నెట్ బ్యాంకింగ్, పోన్‌పే ద్వారా లావాదేవీలు చేపట్టాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎఫ్‌ఎల్ కౌన్సిలర్ సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కోస్గి: గుండుమాల్ మండల పరిధిలోని బోగారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిర్మాణ పనులను సోమవారం ఎంపీడీఓ సాయిలక్ష్మీ పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో మౌళిక వసతుల ఏర్పాటు కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించి పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో పనులు చేపట్టింది. ఈ క్రమంలో ఎంపీడీఓ సాయిలక్ష్మీ, పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణతో కలిసి పరిశీలించి పనులను నాణ్యతగా చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలన్నారు.

తిరుమలలో భజన మండలి



ధన్వాడ: తిరుమల తిరుపతి దేవస్థానం తిరుమలలో నిర్వహిస్తున్న అఖండ హరినామ సంకీర్తనలో ఆంజనేయస్వామి భజన మండలి పాల్గొన్నారు. తిరుమల దేవస్థానంలో ప్రతి ఏడాది రెండుసార్లు అఖండ సంకీర్తనలో పాల్గొనే అవకాశం వస్తుందని కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భజన మండలి సభ్యులు నారాయణ, నర్సింహులు, వెంకటయ్య, రాములు, కృష్ణయ్య, వెంకట్‌రెడ్డి, నారాయణస్వామి, రామాంజనేయులు, రాజు పాల్గొన్నారు.

డీఈఓకు వినతి


డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్ : ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ విద్యాశాఖ పారదర్శకంగా నిర్వహించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీఈఓ అబ్దుల్‌ఘనిని కలుసుకుని వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. 2024 జూన్ 1వరకు ఖాళీలను ట్రాన్స్‌పర్, ప్రమోషన్ లిస్టులో చేర్చాలని, సీనియార్టీ జాబితాలో తప్పులను సవరించాలని, స్పౌజ్ కేటగిరి, తప్పుడు వైద్య ధృవీకరణ పత్రాలు సమర్పించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బాలాజి, భీమయ్య, గోవింద్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి..

మరికల్: మండలంలోని వెంకటాపూర్‌లో 2018లో గుర్తించిన గ్రామ కంఠం స్థలాన్ని అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు మళ్లి కబ్జా చేసేందుకు ప్రయత్నించడంతో సోమవారం అదే గ్రామానికి చెందిన హన్మంత్‌రెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ మే రకు.. ఆయన మాట్లాడుతూ.. గతంలో ఇదే నాయకుడు ఈ స్థలంపై కన్నెయగా గ్రామస్తులు సమాచార హక్కు చట్టం ద్వారా కబ్జాకు గురైనా గ్రామకంఠం స్థలం వెలుగులోకి తీసుకొచ్చామన్నారు. మళ్లి ఆరు ఏళ్ల తర్వాత కొందరు గ్రామకంఠం భూమిలో ఏర్పాటుచేసిన బోర్డును తొలగించి ఆ స్థలంలో మొరం వేయించారని తెలిపారు. ఈ స్థలాన్ని కాపాడాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా నాగేంద్రప్రసాద్



కృష్ణా: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా నాగేంద్రప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు.. ఆయనకు కార్యాలయ సిబ్బంది అభినందించారు. అనంతరం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండటంతోపాటు వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల యూనిఫాంల స్వీకరణ

మాగనూర్: మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, ఏకరూప దుస్తులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ వెంకటమ్మ ఆధ్వర్యంలో మహిళా సంఘాల ద్వారా ఉచితంగా తీసుకున్నట్లు హెచ్‌ఎం స్వప్న తెలిపారు. ఈ మేరకు.. ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతి విద్యార్థికి ఏడాదికి రెండు జతల ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనపథకం అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దీప, విశాలక్ష్మి, శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన కుళాయి సర్వే


సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జయరాములు

మద్దూరు: మండలంలో మిషన్ భగీరథ ఇంటింటి సర్వేను సోమవారం మండలంలో ప్రారంభించారు. మండలంలోని 49జీపీలకు గాను 47జీపీలో ఈ సర్వే కొనసాగుతున్నట్లు ఎంపీడీఓ జయరాములు తెలిపారు. ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి అక్కడ కుళాయిలో నీరు వస్తుందా? ఎంత వస్తుంది ? ఇంట్లో ఎందమంది ఉన్నారు. అలాగే కుళాయి ఉన్నా తాగునీటి సరఫరా జరుగడం లేదా? అసలు నీటీ కుళాయి ఉందా లేదా అనే అన్ని అంశాలపై ఈ సర్వే కొనసాగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి ఈ సర్వే యాప్‌లో చేస్తున్నారని తెలిపారు. లబ్ధిదారుడి ఇంటి వద్దకు వెళ్లి సర్వేచేస్తే తప్ప యాప్ ఓపెన్ కాదని ఆయన పేర్కొన్నారు. పదిరోజుల్లో ఈ సర్వే పూర్తి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సర్వే పరిశీలినలో ఎంపీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బడిబాటలో ఉపాధ్యాయులు


ఇంటింటా ప్రచారంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ధన్వాడ: మండల కేంద్రంలోని సంతబజార్ పాఠశాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఇంటింటి ప్రచారం చేశారు. విద్యార్థులను పనులకు కాకుండా పాఠశాలకు పంపించాలని వారి జీవితంలో స్థిరపడేలా చేయాలని తల్లిదండ్రులకు విన్నవించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలరాజు, పుష్పలత, మౌలిక, సౌజన్య పాల్గొన్నారు.

తైబజార్ వేలానికి దరఖాస్తుల స్వీకరణ


నోటిస్‌బోర్డుపై ఏర్పాటుచేస్తున్న జీపీ సిబ్బంది

మద్దూరు: పట్టణంలో ప్రతి గురువారం జరిగే సంత బజార్, పశువుల సంత వేలంలో పాల్గొనడానికి సోమవారం పంచాయతీ సిబ్బంది దరఖాస్తుల స్వీకరణ చేపట్టింది. ఈ రెండు సంతలకు వేలంలో పాల్గొనడానికి 37మంది వేలం రుసుము రూ. వెయ్యి చెల్లించారని, పంచాయతీ కార్యదర్శి రామునాయక్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మార్చిలో జరగాల్సిన వేలాన్ని వాయిదా వేయడంతో ఈ నెల 12న గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించడం జరుగుతందని పేర్కొన్నారు. వీరు మాత్రమే వేలంలో పాటపాడడానికి అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

భూ కబ్జాపై చర్యలు తీసుకోండి


ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆత్మకూర్: పట్టణంలో లేఅవుట్ల ద్వారా ప్రభుత్వానికి కేటాయించిన 400లకుపైగా 10 శాతం ప్లాట్లు అన్యాక్రాంతమయ్యాయని రూ.5 కోట్లకు పైగా అక్రమంగా అర్జించారని టీపీసీసీ అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్ ఆరోపించారు. సోమవారం మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు, కమిషనర్ కలిసి 400లకు పైగా ప్లాట్లను అసెస్‌మెంటు నంబర్లు ఇచ్చి బినామీల పేరిట అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకున్నారన్నారు. ఆ ప్లాట్లను రూ.3 లక్షల నుండి రూ.10లక్షల వరకు ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయించి అమ్ముకున్నారని చెప్పారు. అలాగే పరమేశ్వరస్వామి చెరువ కట్టవద్ద శిఖ భూమిలో షాపులను నిర్మించారని, పరమేశ్వర స్వామి ఇనాం భూమిని ప్లాట్లుగా విక్రయించారని, వేంకటేశ్వరస్వామి భూమిలో ప్లాట్లుచేసి అమ్ముకున్నారని, హైటెక్ టాకీస్ వద్ద గోటౌన్ భూమిలో నిర్మాణాలు చేపట్టారన్నారు. పూర్తి ఆధారాలతో కలెక్టర్, కమిషనర్, తహసీల్దార్, సీఐ, ఎస్ఐ, విజిలెన్సు అధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో గంగాధర్‌గౌడ్, గంగాధర్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తులసిరాజ్‌యాదవ్, పరమేష్, శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరం


క్రీడాకారుడుని సన్మానిస్తున్న వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు

మద్దూరు: మండలంలోని వాలీబాల్ అసోసియేషన్, జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో 40 రోజులుగా నిర్వహించిన వేసవి వాలీబాల్ ఉచిత శిక్షణశిబిరం సోమవారం ముగిసింది. ఈ వేసవి శిక్షణలో పాల్గొన్న వారికి జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శి రమణ, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అథిక్, సభ్యులు మహేష్, బాలు, శాంతు, జనార్ధన్, మహిపాల్ తదితరులు కలిసి ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ మేరకు.. మద్దూరు మండలం నుంచి అండర్ 14విభాగంలో జాతీయస్థాయిలో అథ్లెటిక్ బసంత్ క్యాంస పథకం సాధించడంతో శాలువాతో సన్మానించారు. అలాగే ఇదే మండలానికి చెందిన అనిల్, మహిత అనే క్రీడాకారులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబర్చడంతో వారికి శాలువాతో సన్మానించారు. వేసవి శిక్షణకు సహకరించిన వారిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసై పోతున్నారు. శారీరక శ్రమ పూర్తిగా లేకుండా పోతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో శిక్షణ పొందిన విద్యార్థులకు, క్రీడాకారులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన కార్మికులు

ఆత్మకూర్: ఉపాధిహామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు అజయ్ అన్నారు. సోమవారం ఆత్మకూర్, అమరచింత, మదనపూర్ మండలాల ఉపాధి కూలీలు, ఫీల్డ్‌అసిస్టెంట్లతో కలసి హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రసదస్సుకు తరలివెళ్లారు. ఉపాధిహామీ పథకానికి బడ్జెట్లో నిధుల కేటాయింపును కుదిస్తు వస్తున్నారని పథకాన్ని పూర్తిగా ఎత్తివేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారని ఆరోపించారు. పని ప్రదేశాల్లో టెంట్లు, తాగనీటి సౌకర్యం కల్పించాలని, రోజుకు రూ.800 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

తవ్వారు.. వదిలేశారు..



అమరచింత: పట్టణంలోని రెండో వార్డులో డ్రైయినేజీ నిర్మాణం కోసం వీధిలో రహదారిని తవ్వారు. తవ్విన ప్రదేశంలో సిమెంట్ బెడ్ వేసి ఏడాది గడుస్తున్నా ఇప్పటికి పనులు చేపట్టడం లేదు. దీంతో కాలనీ వాసులు వార్డు కౌన్సిలర్ లావణ్యను పలుమార్లు అడుగగా కాల్వ నిర్మాణం కోసం ఎస్టిమేషన్ జరగలేదని దీనికోసం మున్సిపల్ చైర్‌పర్సన్, ఏఈకి విన్నవించామన్నారు. రెండో వార్డులోని గోల్లవిష్ణువర్ధన్ యాదవ్ ఇంటి నుంచి డ్రైయినేజీ నిర్మాణం కోసం తవ్విన ప్రాంతంలో కొత్త డ్రైయినేజీని నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు. తవ్వి వదిలేయడంతో రాత్రుల్లో గుంతల్లో పడి గాయల పాలవుతున్నారని తెలిపారు. ఇప్పటికైన తమ కాలనీలో అసంపూర్తిగా ఉన్న పనులను చేపట్టాలని కోరుతున్నారు.